
# మూల పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 20**

గిద్దలూరు మండలం వేములపాడు గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా మూల పెద్దమ్మ తల్లి ఆలయాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోకరెడ్డి సందర్శించు కున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు ప్రజలందరికీ శుభసమృద్ధి కలగాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలతో కలసి ఉగాది శుభాకాంక్షలు పంచుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సహబంతి భోజనం చేశారు కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, కొండయ్య, మార్తాల సుబ్బారెడ్డి, మండల, స్థానిక నాయకులు తదితరులు విందులో పాల్గొన్నారు.



పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# రైతులకు అండగా కూటమి

## ఎమ్మెల్యే కందుల





**తర్లుపాడు పెన్ పవర్ మార్చి 20**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. తర్లుపాడు మండలం లోని మీర్జాపేట గ్రామం లో ఏర్పాటుచేసిన " రైతన్న మీకోసం ' కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రాధాన్యతను బట్టి అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు ఉన్న ఎంత లోటు బడ్జెట్ ఉన్న రైతుల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తు న్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తొమ్మిది లక్షల కోట్ల లోటు బడ్జెట్ సరిజేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. గత ఐదేళ్లు అభివృద్ధిని మరిచి పాలన చేసిన వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడటం హేయమన్నారు. జిల్లా ఎందుకు అని వైసిపి నాయకులు మాట్లాడు తున్న మాటలను ఆయన ఖండించారు. జిల్లా అభివృద్ధి ఏమిటో ముందు ముందు తెలుస్తుందన్నారు. మార్కాపురం హార్టి కల్చర్ హబ్ గా తయారు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. చదువుకున్న యువత ప్రతి గ్రామంలో పనిచేస్తున్న ప్రభుత్వానికి మద్దతు తెలపాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కష్టపడుతున్న చంద్రబాబు నాయుడు,లోకేష్ , పవన్ కళ్యాణ్ లకు మనందరం అండగా నిలవాలన్నారు. ఇప్పటికే అన్ని పథకాలు అమలు చేస్తూ యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ ముందుకు దూసుకెళ్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, తర్లుపాడు మండలం తెలుగుదేశం నాయకులు, మీర్జా పేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల వరప్రదాయిని కూటమి ప్రభుత్వం

## మాట తప్పని యోధుడు లోకేష్

- ప్రతి ఉగాదికి జాబ్ క్యాలెండర్
- పారిశ్రామిక హబ్ గా కందుకూరు
- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు
- పరుగులు తీయనున్న పారిశ్రామిక రంగం
- 8 కోట్ల రూపాయలతో సాగునీటి చెరువుల అభివృద్ధి
- సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**కందుకూరు పెన్ పవర్ మార్చి 20**

జాబ్ క్యాలెండర్ ద్వారా రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులను ఉద్యోగులుగా మారుస్తూ నిరుద్యోగుల పాలిట వరప్రదాయనిగా కూటమి ప్రభుత్వం నడుస్తుందని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ ఈ 20 నెలల్లో రాష్ట్రంలో ఊహించలేనంత అభివృద్ధి జరిగింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేర్చారు అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6.28 లక్షల ఉద్యోగాలు ఘనత మాది అని అన్నారు. మొత్తంగా 23 లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో మా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తాజాగా పదివేలకు పైగా పోస్టుల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు లాంటి పథకాలు ప్రజలకు బాగా ఉపయోగపడుతున్నాయి అని అన్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోంది అని అన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని జగన్మోహన్ రెడ్డి మోసం చేశారు. రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకురాకపోగా... కమీషన్ల కోసం ఉన్న కంపెనీలను తరిమేశారు. దాంతో సరైన ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక 4 వేల మందికి పైగా నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మరోసారి జగన్ వస్తే విధ్వంసం తప్పదన్న భయం ప్రజల్లో ఇప్పటికీ ఉంది అని అన్నారు. కందుకూరు నియోజకవర్గంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతులు ఏర్పాటు చేస్తున్నాం. బిపిసిఎల్ ఇండోసోల్ కంపెనీలతోపాటు రామాయపట్నం పోర్టు కారణంగా పారిశ్రామిక అభివృద్ధి జరగబోతోంది. వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లి వద్ద 100 ఎకరాల్లో ఎమ్మెస్ ఏం ఈపార్క్ రాబోతోంది అని తెలిపారు. ఎనిమిది కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో ఉన్న సాగునీటి చెరువులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇవ్వగలం పాదయాత్రలో లోకేష్ బాబు ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పిన మాట ప్రకారం మాట తప్పనియోధుడు లోకేష్ బాబు అని అన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ బాబు విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని అన్నారు.కందుకూరులో టిడిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కనిపించిన నెలవంక.. నేడే రంజాన్...

ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా ప్రాంతం.



**పెన్ పవర్, కంభం మార్చి 20 :**

ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పండుగ శనివారం జరగనుంది. శుక్రవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించింది. రంజాన్ పండుగ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. శుక్రవారంతో రంజాన్ ఉపవాసాలు ముగిశాయి. ఈద్ ఉల్ ఫితర్ పండుగ ముస్లింలు పవిత్రంగా భావిస్తారు. రంజాన్ నెల ఆరంభం నుంచి 30 రోజులు పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించారు . కంభం పట్టణంలో పలు మసీదులు ఉన్నప్పటికీ అందరూ ఈద్గా వద్దకు వెళ్తారు గ్రామీణ ప్రాంతాల సైతం ఈద్గా వద్దకే వస్తారు. వేసవి కాలం కావడంతో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభిస్తారు. గ్రామీణ ప్రాంతాలైన హజరత్ గూడెం చిన్న కంభం తురిమెళ్ళ లింగోజిపల్లె ఎల్ కోట లింగాపురం గ్రామాలలో కూడా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ నెలలో ముస్లింలు జకాత్ రూపంలో పేదలకు తమ ధనములో రెండున్నర శాతం సొమ్మును దానం చేస్తారు. ముస్లింలు చేసే ప్రార్థన నమాజ్ మానసిక పరివర్తన తెస్తుంది. నిర్మల మనసుతో పాటు మానసిక శారీరక ప్రశాంతత నేర్పుతుంది .ఇందులో భాగంగా రాత్రి చేసే ఇషా నమాజ్ తర్వాత 30 రోజుల రంజాన్ మాసంలో ప్రత్యేక తరావీ నమాజ్ కూడా ఆచరించారు. ఈ మాసంలో సంపన్నులు పేద ముస్లిం వర్గాల వారికి దానధర్మాలు పేదలను ఆదుకోవడం జరిగింది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రతి ఒక్కరికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తారు.

# పార్టీ బలోపేతానికి కృషి చెయ్యాలి

## పార్లమెంట్ పరిశీలకులు కదిరి





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 20**

వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్సీపి విశాఖపట్నం పార్లమెంటు పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు విశాఖపట్నం, మద్దిలపాలెం, కృష్ణ కాలేజ్ రోడ్డు లో గల పార్టీ కార్యాలయంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ పరిధిలో సమన్వయ కర్తలు మరియు పరిశీలకులతో సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, వ్యవస్థీకరణ మరియు డిజిటల్ పరిపాలనపై కీలక నిర్ణయాలు తీసుకోబడ్డాయని పార్లమెంటు పరిశీలకులు కదిరి బాబు రావు, జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె రాజు అన్నారు .ఈ సమావేశంలో పార్టీ కమిటీల ఏర్పాటు (డిజిటల్ ప్రాతిపదికన) రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, వార్డు మరియు సచివాలయం స్థాయిలలో పార్టీ కమిటీలను సమగ్రంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి కమిటీ సభ్యుల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసి, సమగ్ర డేటాబేస్‌ను రూపొందించడంతో పాటు దాని నిర్వహణపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం జరిగింది .అలాగే కమిటీల వివరాల సమర్పణ ఏర్పాటు చేసిన కమిటీల వివరాలను నిర్ణీత కాలవ్యవధిలో జిల్లా పార్టీ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అనంతరం, ఈ వివరాలను సమగ్ర నివేదిక రూపంలో కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి టైమ్‌లైన్ మరియు బాధ్యతలను స్పష్టంగా నిర్వచించారు.సమావేశంలో పాల్గొన్న నాయకులు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో రాష్ట్ర పార్టీ కార్యదర్శి (కో ఆర్డినేషన్) హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గం సమన్వయ కర్తలు మళ్ళ విజయ ప్రసాద్, వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు ,నియోజకవర్గం పరిశీలకులు పసుపులేటి బాల రాజు, కొత్తగుల్లి భాగ్య లక్ష్మి, సిఎంఎ జహీర్ అహ్మద్, చింతకాయల సన్యాసాయి పాత్రుడు, వీసం రామ కృష్ణ, పెదాడ రమణి కుమారి పాల్గొన్నారు.

# రంజాన్ ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు

## శనివారం ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని నిర్వహించుకోనున్న ముస్లింలు.



**కొమరోలు పెన్ పవర్ మార్చి 20**

రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదిన నమాజులు జరుపుకునేందుకు మండలంలోని ఈద్గాలు ముస్తాబయ్యాయి .గత నెల 18 తేదీన రంజాన్ నెలవంక చూసిన ముస్లింలు 19వ తేదీ నుంచి పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజులపాటు కఠోర నియమాలతో ఉపవాసాలతో గడిపారు. 30 రోజులు అనంతరం ఈనెల 20వ తేదీన షవ్వాల్ నెల చంద్ర దర్శనం కావడంతో 21వ తేదీన ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని జరుపుకునేందుకు ముస్లింలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. గ్రామాల వెలుపల ఏర్పాటుచేసిన ఈద్గాలలో ముస్లింలు రంజాన్, బక్రీద్ పర్వదినాల ప్రత్యేక నమాజులను జరుపుకుంటారు. అందులో భాగంగా ఈనెల 21న జరిగే ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పర్వదిన ప్రత్యేక నమాజులను నిర్వహించుకునేందుకు ముస్లిం మత పెద్దలు, మసీదు, ఈద్గాల కమిటీ సభ్యులు ఈద్గాల మైదానాలను శుభ్రపరచి నమాజులకు సిద్ధం చేశారు. అంతేకాక నమాజులకు ముందు భక్తులు వజూ చేసుకునేందుకు వీలుగా నీటి సౌకర్యంతో పాటు ప్రత్యేక నమాజులకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఆయా గ్రామాలలోని ముస్లిం సోదరులు ,పిల్లలు మసీదుల వద్దకు చేరి అక్కడి నుంచి తక్బీర్ పాడుకుంటూ ర్యాలీగా ఈద్గల వద్దకు చేరనున్నారు. ఈద్గాలో మత పెద్దల ఆధ్వర్యంలో ఈద్-ఉల్-ఫిజర్ ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి . నమాజ్ అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకుంటారు .అనంతరం దారి పొడవునా దానధర్మాలు చేస్తూ అల్లా కృపకు పాత్రులు అవుతారు. ఈద్-ఉల్- ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర, సోదరీమణులకు ముస్లిం మేతర రాజకీయ ప్రముఖులు స్నేహితులు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు, బాలికలు ఇళ్ల వద్దనే వీధులలోని మహిళలను కలుపుకొనిజట్లుగా ఏర్పడి ఈద్-ఉల్-ఫితర ప్రార్థనలు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజులపాటు ఉపవాసాలు ఉండే సౌకర్యం, ఆరోగ్యం కల్పించడంతోపాటు 30 రోజులు గా జరిగిన తరావీహ్ నమాజులను ఐదు పూటల నమాజులలో పాల్గొనే అవకాశం కల్పించిన అల్లాకు ముస్లిం సోదరీ సోదరీమణులు చిన్నారులు షుక్రియా అదా చేశారు. వచ్చే ఏడాది రంజాన్ మాసంలో కూడా ఉపవాసాలు ఉండే విధంగా ఐదు పూటలా నమాజులు, తరావీహ్ నమాజులు చేసుకునే అవకాశం కల్పించాలని అల్లాతో దువా చేస్తున్నారు.

# రంజాన్‌కు సర్వం సిద్ధం..

### -నేడే రంజాన్ -ఉదయం ఏడు గంటల నుంచే ప్రత్యేక ప్రార్థనలు

### - ఈద్గా, మసీదు లలో ప్రత్యేకమైన ఏర్పాట్లు

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 20**

ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగను నేడు జరుపుకోనున్నారు. రంజాన్ మాసాన్ని అతి పవిత్రమైన మాసంగా భావిస్తారు. ఈ మాసంలో చేసే నమాజ్ లకు అత్యంత విశిష్ట ఉంటుందని వారి నమ్మకం. ప్రతి సంవత్సరం ఈ మాసంలో మసీదుల వద్ద కలిసిమెలిసి నమాజ్ చేసుకుంటారు. ఈ ఏడాది 30 రోజుల ఉపవాస దీక్ష అనంతరం సంతోషంగా రంజాన్ ను జరుపుకోనున్నారు. ప్రతి ముస్లిమ్ తప్పనిసరిగా ఉదయం వేళ ఫజర్ నమాజ్ ఆచరించి, ఈదుల్ పితర్ చదవాల్సి ఉంటుంది. నమాజ్ చదివేముందు పవిత్రంగా తలస్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి, అత్తరు చల్లుకుంటారు. తప్పనిసరిగా సేమియా తిని ఉజూ చేసుకొని నమాజ్ ఆచరిస్తారు. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతల ప్రభావం చూపుతున్న రోజు ఐదు సార్లు నమాజ్ చేస్తూ తమకు ఉన్నదాంట్లో పేదలకు ధనా ధర్మాలు చేశారు. ఈ ఉపవాస దీక్ష మనిషిలోని చెడు భావాన్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతుందని ముస్లింల నమ్మకం.

**ఫిత్రా, జకాత్ చెల్లింపులు ప్రత్యేకం..**

ఫిత్రా (దానం) తప్పనిసరిగా చెల్లించి ఈదుల్-ఫితర్ నమాజ్ చదవాలనే



నియమం ఉంది. ఫిత్రా పేరుమీదనే ఈ పండుగకు ఈదుల్ ఫితర్ అని పిలుస్తుంటారు. రెండున్నర కిలోల గోధుమ పిండి కానీ కొంత నగదును కానీ చెల్లించాలని ఉంది. అయితే అంతకంటే ఎక్కువ కూడా ఫిత్రా ఇస్తుంటారు. ఈ దానం వల్ల నిరుపేదలు సైతం పండుగను సంతోషంగా జరుపుకునేందుకు అవకాశం ఉంటుందని ముస్లిం పెద్దలు తెలుపుతున్నారు.



## ఖాసిం వలికి ఆర్థిక సహాయం అందజేసిన అన్నా మిత్రమండలి



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 20**

స్థానిక 17 వ బ్లాక్ కు చెందిన ఖాసిం వలి అనే బాలుడు కొన్ని రోజుల క్రితం విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటనలో బాలుడు తీవ్ర గాయాలు పాలై గుంటూరులో చికిత్స పొందుతూ ఇటీవలే తన నివాసానికి చేరుకున్నారు. రంజాన్ సందర్భంగా ఆ బాలుడు కుటుంబానికి 12, రూపాయల నగదు, రంజాన్ కిట్ ను అన్నా మిత్రబండలి సభ్యులు అందజేశారు. వైసిపి నాయకులు వార్డెన్ నజీర్, 18వ బ్లాక్ వైసిపి ఇన్చార్జి సయ్యద్ గఫూర్, 13వ బ్లాక్ జాఫర్, మహబూబ్ బాషా ఆధ్వర్యంలో లక్ష 20వేలు నగదును బాలుడికి గతంలో అందజేసి ఉన్నారు. తీవ్ర గాయాలతో ఇప్పటికి కోలుకోలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవడం సంతోషకరమన్నారు. తమకు సహాయ సహకారాలు అందించిన దాతలకు బాలుడు తల్లి ధన్యవాదాలు తెలిపారు.

## ఉపాధ్యాయుడిపై విచారణ....





**పొన్నలూరు, పెన్ పవర్ మార్చి 20**

మండలంలోని సుంకి రెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధయుడుగా పనిచేస్తున్న పిగిలి కొండయ్య విద్యార్థులతో ప్రవర్తిస్తున్న తిరుపై డిప్యూటీ డిఇఓ చంద్రమౌళీశ్వర్ ఆపాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుడు పిగిలి కొండయ్య విద్యార్థులతో ప్రవర్తిస్తున్న తీరు సక్రమంగా లేదని పలువురు ఫిర్యాదు చేశారు. దీనితో డిప్యూటీ డి ఈ ఓ విచారణ చేపట్టి, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులతో ఉపాధ్యాయుడు వ్యవహార శైలిపై ఆరా తీశారు. డిప్యూటీ డిఇఓ చంద్రమౌలేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు అయినటువంటి పిగిలి కొండయ్య తమ పిల్లలను కొట్టేవారని, కాళ్లు, తల మసాజ్ , బుగ్గలు గిల్లేవారని తల్లిదండ్రుల విచారణలో తెలిపారు. ఈ విషయంను ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రవిచంద్రబాబు, సుబ్బరామయ్యలు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోండి : సయ్యద్ గఫూర్



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 20**

నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షల అనంతరం భక్తిశ్రదలతో నిర్వహించే రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని స్థానిక 18 వ బ్లాకు వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జి సయ్యద్.గఫూర్ ఆకాంక్షించారు. రంజాన్ పుర్వదినాన్ని పురస్కరించు కుని ముస్లీంలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. 30 రోజులు ఎంతో నిష్టతో, భక్తిశ్రద్దలతో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు చేసిన ముస్లీం సోదరులు ఎంతో సంతోషంగా జరుపుకునే రంజాన్ పండుగను కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. పండుగను పురస్కరించుకుని వారికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వరాలు కలిగేలా చూడాలని ఆల్లాహ్ ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## రైతన్నకు అండగా కూటమి ప్రభుత్వం

### ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి



**కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 20**

రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతగుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన "రైతన్న మీకోసం" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ప్రాధాన్యత ఇస్తూ వాటిని నెరవేరుస్తున్నారని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. రైతులకు మద్దతు ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం వారి భారాన్ని తగ్గిస్తుందని ఈ పథకం రైతులకు కష్టకాలంలో మద్దతుగా నిలుస్తోందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మండలంలో కందులు, శనగల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. రైతులు తమ పంటలను నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సమయానికి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సాగు ఖర్చులు తగ్గించే దిశగా పలు పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. అలాగే పంట బీమా పథకాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాబురావు, నాయకులు కాశీరెడ్డి, భాషాపతి నాయుడు, సుఖదేవ్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, తహశీల్దార్ సురేష్, వ్యవసాయ అధికారి ప్రకాష్ రావు ఇతర శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పోకూరు - రాళ్లపాడు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

*3 కోట్లతో జరగనున్న పనులు -పోకూరులో ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు*

*పనులు నాణ్యతతో, త్వరగా పూర్తిచేయాలని సూచించిన ఎమ్మెల్యే ఇంటూరి*



**వలేటివారిపాలెం, పెన్ పవర్ మార్చి 20**

పోకూరు నుంచి శాఖవరం, విఆర్ కోట, చీమలపెంట మీదుగా రాళ్లపాడు వరకు రోడ్డును అభివృద్ధి చేసే పనులకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పోకూరులో శంకుస్థాపన చేశారు. రోడ్లు భవనాల శాఖ నుంచి ఎండిఆర్ గ్రాంట్ ద్వారా మంజూరైన 3 కోట్ల రూపాయలతో 18 కిలోమీటర్ల పొడవున రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ముందుగా పోకూరు గ్రామంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు కి అపూర్వ స్వాగతం లభించింది. టిడిపి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే పై పూలవర్షం కురిపిస్తూ మేళతాళాలతో శిలాఫలకం వద్దకు తీసుకెళ్లారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ పనులు నాణ్యతతో త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రస్తుతం రోడ్డుకు రెండు వైపులా ఉన్న డ్రైనేజీ కాలువలకు



సమానంగా కొత్తరోడ్డును నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాల్, జెఈ భరత్ రెడ్డి, ఎంపీడీవో శంకర్రావు, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిన వెంకటేశ్వర్లు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, సోమినేని తిరుమలరావు, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, ఘట్టమనేని చెంచురామయ్య, నవులూరి సుబ్బానాయుడు ,నల్లమోతు రవీంద్ర, ఘట్టమనేని సీతయ్య, అత్తోట వెంకటేశ్వర్లు, ఆలూరి రాములు, పెగడ శ్రీనివాసులు, మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశైలం భక్తులకు అన్నదాన కార్యక్రమం - ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం పెన్ పవర్ మార్చి 20**

ఉగాది మహోత్సవాల సందర్భంగా సుదీర్ఘ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకొని మొక్కులు తీర్చుకొని తిరిగి వెళుతున్న భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మార్కాపురం రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం కు రావడం జరుగుతుందన్నారు. వారికి స్థానిక రైల్వే స్టేషన్ లో అన్నదాన కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, రాష్ట్ర టిడిపి నాయకుడు మస్తానయ్య, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన దాతలు పాల్గొన్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బడే నాయబ్ రసూల్, షేక్ రజ్జబ్ భాష





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 20**

రంజాన్ పర్వదినం సందర్భంగా మండల టిడిపి సీనియర్ నాయ కులు, కోవిలంపాడు ప్రముఖులు షేక్ నాయబ్ రసూల్ (బడే) చంద్రపూర్, మహారాష్ట్ర మరియు మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జి షేక్ రజ్జబ్ భాష శుక్రవారం ఒక ప్రకటనలో ముస్లిం సోదర, సోదరీ మణులందరికీ ఈద్ ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దాన ధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించే ఈ రంజాన్ కనిగిరి నియోజకవర్గం ప్రజలకు సుఖసంతోషాలు కలిగించాలని, సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ పండుగ సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని తెలిపారు..పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుకని ముస్లిం కుటుంబ సభ్యులందరూ ఐకమత్యంగా రంజాన్ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## కందులు కొనుగోలు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే

### మండల వ్యవసాయాధికారి పి మధుబాబు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 20**

మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో పెద్ద గోగులపల్లి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కందులు కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల మేరకే కొనుగోళ్లు జరుగుతాయని మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు తెలిపారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కొనుగోలు ప్రక్రియలో రైతులకు ముందుగా అన్ని నిబంధనలు స్పష్టంగా తెలియజేస్తున్నామని, రైతులు తమ ఇష్టప్రకారం కందులను ప్రభుత్వం ద్వారా లేదా బయట మార్కెట్లో అమ్ముకునే పూర్తి స్వేచ్ఛ కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. కందుల కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రైతులు రాతపూర్వకంగా అర్జీ రూపంలో తమ దృష్టికి లేదా మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

